సాక్షి
కృష్ణాజిల్లా
గురువారం । 25 । జూలై । 2024



శివరామకృష్ణ క్షేత్రానికి విరాళం

కోడూరు: కోడూరులో నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి అప్పికట్ల పాములు, విజయలక్ష్మి దంపతులు రూ.1,01,116 నగదును బుధవారం విరాళంగా అందించారు.



సారె సమర్పణ

వేదాద్రి(జగ్గయ్యపేట): వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని చెంచు లక్ష్మి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు పలువురు మహిళలు బుధవారం సారె సమర్పించారు.

మర్యాదపూర్వక కలయిక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమితులైన ధ్యానచంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజనను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వాతావరణంలో మార్పులు, దోమకాటుతో కలిగే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సందర్శించి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. రెడ్డిగూడెం పీహెచ్‌సీ పరిధిలోని పాత నాగులూరులో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడి ఎస్సీ కాలనీలో ఇంటింటి సర్వే చేసి సీజనల్ వ్యాధులు, దోమలు, లార్వా నాశనం చేసే పద్ధతులపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, డాక్టర్ సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థి పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై బుధవారం గణపతికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని రుద్రహోమ యాగశాలలో గణపతికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఘాట్‌రోడ్డులో రక్షణ చర్యలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్‌రోడ్డు, దుర్గాఘాట్ ఎదుట కొండ చరియలు విరిగి పడిన చోట రక్షణ చర్యలు తీసుకుంటున్నామని ఈవో కె.ఎస్.రామరావు పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డు మొదటి మలుపు వద్ద బుధవారం పనులకు ఈవో రామరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ నిపుణుల సూచనలు, సలహాల మేరకు రక్షణ చర్యలు చేపట్టామన్నారు. ఘాట్‌రోడ్డులో గణపతి, అమ్మవార్లకు పూజలు చేసి కొండ రాళ్లను తొలగించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు..



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులు ఆత్మస్థైర్యం, విశ్వాసంతో ముందు సాగి లక్ష్యాలను సాధించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమసంస్థ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతురాలు దారెల్లి కుమారికి రూ. 1.15 లక్షల విలువైన మూడు చక్రాల మోటార్ వాహనాన్ని కలెక్టర్ సృజన అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, బధిర, మూగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, టచ్‌ఫోన్ల పంపిణీతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వి. కామరాజు పాల్గొన్నారు.

తరలించేస్తున్నారు!

- తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా
- కీసర, మోగులూరు, అనుమంచిపల్లె నుంచి తరలింపు
- తెలంగాణలో సైతం పట్టుబడిన ఇసుక లారీలు
- టీడీపీ కనుసన్నల్లోనే భారీగా ఇసుక దందా
- పట్టించుకోని అధికారులు



అనుమంచిపల్లి స్టాక్‌యార్డ్ వద్ద తెలంగాణ లారీలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలోని ఇసుకను తెలంగాణకు తరలించేస్తున్నారు. రాష్ట్రంలో అధికార 'కూటమి' అండదండలతో టీడీపీ నేతల కనుసన్నల్లోనే స్టాక్ యార్డుల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నదులు, వాగుల్లో నీరు ప్రవహిస్తుండటంతో తెలంగాణలో ఇసుకకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకొన్న తమ్ముళ్లు కీసర, మోగులూరు, మాగల్లు, అనుమంచిపల్లె స్టాక్‌యార్డ్ నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రధానంగా ఇసుక హైదరాబాద్, ఖమ్మంకు తరలిస్తున్నారు. ఇక్కడ స్టాకు యార్డులో టన్ను రూ.290 చెల్లించి, ఇసుక లోడు చేసుకొని ఖమ్మంలో టన్ను రూ.1800, హైదరాబాద్‌లో రూ.2,400 వంతున అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి అదనంగా రవాణా చార్జీలను వసూలు చేస్తున్నారు. లారీకి 20 టన్నులు ఇసుక తీసుకెళ్లాల్సిండగా, స్టాక్‌యార్డ్‌ల వద్ద మేనేజ్ చేసి, 37టన్నుల అధిక లోడుతో తీసుకెళ్తున్నారు.

అధికారులకు 'మామూలే'

ఈ దందా అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే సాగుతోంది. స్టాక్‌యార్డ్‌ల వద్ద అక్కడ ఉన్న సిబ్బందిని మేసేజ్ చేసుకొని, తమ అనుచరులకు చెందిన వాహనాల్లో ఇసుక లోడ్ చేయిస్తున్నారు. అదనపు డబ్బు చెల్లిస్తే ఎక్కువ ఇసుక లోడు చేస్తున్నారు. దందా యథేచ్ఛగా సాగుతున్నా సెబ్, స్థానిక పోలీసులు, రవాణా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఇసుక అక్రమార్కులకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. టీడీపీ నాయకులకు చెందిన వాహనాలు కాకుండా విజయవాడ, ఇతర ప్రాంతాల నుంచి వెళ్లిన ఇసుక వాహనాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొన్నా ఒకటి, రెండు రోజులు ఉండాల్సిందే. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు స్టాక్‌యార్డ్‌ల వద్ద బారులు తీరుతున్నాయి. దీంతో అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కొడవటికల్లు నుంచి చందర్లపాడు మధ్యలో ఉన్న స్టాక్‌యార్డ్ వద్ద వందలాదీ లారీలు నిలుస్తుండటం.. సింగిల్ దారి కావడంతో గ్రామంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది.

నామమాత్ర తనిఖీలు

ఎన్టీఆర్ జిల్లా స్టాక్‌యార్డ్‌ల నుంచి రాత్రి వేళల్లో భారీగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఏపీ సరిహద్దులో అధికారులు నామమాత్ర తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. స్టాక్‌యార్డ్‌ల వద్ద తెలంగాణకు చెందిన లారీలు బారులు తీరి ఉంటున్నాయి. అక్కడి సిబ్బందిని ఇసుక మాయగాళ్లు మామూళ్లతో మభ్యపెడుతున్నారు.

అధిక లోడుతో ఇసుక లారీలు

ఎన్టీఆర్ జిల్లాలోని స్టాక్‌యార్డ్‌ల నుంచి అధిక లోడుతో ఇసుక తరలి పోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అరకొర తనిఖీలతో సరిపెడుతున్నారు. ఇటీవల జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి స్టాక్‌యార్డ్ నుంచి వస్తున్న ఏపీ39 యూక్యూ 5697 నంబర్ లారీని సెబ్ అధికారులు తనిఖీ చేసి వే బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి కాటా వేయించారు. అక్కడ పరిశీలించగా 17.04 టన్నుల ఇసుకను అధికంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వాస్తవంగా అనుమంచిపల్లి ఇసుక స్టాక్‌యార్డ్‌లో ఇచ్చిన ట్రాన్సిట్ పర్మిట్ ప్రకారం లారీలో 20 టన్నులు ఇసుక ఉండాలి అయితే 37.04 టన్నులు ఇసుక ఉన్నట్లు గుర్తించారు. అధికంగా 17.04 టన్నుల ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. టన్నుకు 2వేల చొప్పున రూ.34,800 జరిమానా విధించారు. ఇలా పెద్ద ఎత్తున ఇసుకను అధిక లోడుతో అక్రమంగా తెలంగాణకు తరలించి అక్రమార్కులు దండుకొంటున్నారు.

తెలంగాణ పోలీసుల అదుపులో ఇసుక లారీ

ఏపీ నుంచి ఖమ్మం వెళ్తున్న ఇసుక లారీని ఇటీవల మధిర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోగులూరు, కంచికచర్ల నుంచి ఖమ్మంకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని వైఎస్సార్ సెంటర్ మధిర టౌన్‌లో ఎస్ఐ సంధ్య సిబ్బందితో తనిఖీలు చేసి స్టేషన్‌కు తరలించారు. లారీతో పట్టుబడిన వ్యక్తి మోగులూరుకు చెందిన ఎస్.కె మహమ్మద్‌గా గుర్తించారు.



ఇటీవల మధిర వద్ద పట్టుబడిన ఇసుక లారీ

అతనిపై 318(4) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు.

లారీలు, టిప్పర్లను అనుమతిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

అనుమంచిపల్లి (జగ్గయ్యపేట): గ్రామంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు లారీలు, టిప్పర్లను అనుమతిస్తే చర్యలు తీసుకుంటామని జగ్గయ్యపేట స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి హెచ్చరించారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు తెలంగాణ లారీలు అనే కథనాన్ని బుధవారం 'సాక్షి' ప్రచురించింది. దీంతో స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్దకు ట్రాక్టర్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. లారీలు, టిప్పర్లను అనుమతించేది లేదన్నారు. ముఖ్యంగా ఉచిత ఇసుక అనేది లబ్ధిదారులకు చేరాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కొందరు ఇష్టానుసారం వే బిల్లులు తీసుకొని లారీల ద్వారా బయటికి తరలిస్తున్నట్లు సమాచారం వస్తోందన్నారు. స్టాక్ పాయింట్ సిబ్బంది అలసత్వంగా ఉంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. విధుల్లో ఉన్న రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు పలు సూచనలు చేశారు.



స్టాక్ పాయింట్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న సీఐ

ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌నాయక్‌పై కట్నం వేధింపుల కేసు

విజయవాడస్పోర్ట్స్: ఏపీ సీఐడీ ఐజీగా పని చేసిన సునీల్‌కుమార్‌నాయక్‌పై విజయవాడ సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. సునీల్‌కుమార్ తల్లిదండ్రులు వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ అతని భార్య పద్మ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ రైల్వే డివిజన్ ఆస్పత్రి సీనియర్ డివిజనల్ వైద్యాధికారిగా పని చేస్తున్న ఆమె ప్రస్తుతం రేడియో స్టేషన్ సమీపంలోని రైల్వే అధికారుల క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. ఆమె ఫిర్యాదుపై భారతీయ న్యాయ సన్హిత(బీఎన్ఎస్) క్లాజ్ 85, 3, 4 డీ. పీ.ఏ కింద ఈ నెల 23వ తేదీ మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ దుర్గారావు తెలిపారు. సునీల్‌కుమార్‌నాయక్, పద్మకు 2007లో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. 2022లో టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడు అరెస్ట్ వ్యవహారంలో సునీల్‌కుమార్‌నాయక్ కీలక పాత్ర పోషించాడు. అప్పట్లోనే అతనిపై అయ్యన్నపాత్రుడు మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన అరెస్ట్ వ్యవహారంలో నిబంధనల ప్రకారమే వ్యవహరించామని అప్పట్లోనే ఐజీ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన పాట్నాలో పని చేస్తుండగా, అయ్యన్న పాత్రుడు ఏపీ స్పీకర్ హోదాలో ఉన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో ఇటలీ పర్యాటకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఇటలీ పర్యాటకులు బుధవారం సందర్శించారు. ఇటలీకి చెందిన నేచురోపతి వైద్యుడు శామ్యూల్ నేతృత్వంలో పర్యాటకులు నియోని, పిట్రోడా, నైనీ, లోరా భారతీయ ప్రాచీన ఆయుర్వేద వైద్యం విశిష్టతను తెలుసుకునేందుకు ఇక్కడకు విచ్చేశారు. ఆయుర్వేద ఆస్పత్రి ప్రాంగణంలో పెంచుతున్న అశ్వగంధ, సర్పగంధ, తదితర ఔషధ మొక్కలపై ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు వాహినిని అడిగి తెలుసుకున్నారు. ఇటలీ నేచురోపతి వైద్యంలోనూ భారతీయ ఆయుర్వేద మందులు వినియోగంలో ఉన్నాయని, ఆ మొక్కలను ఇక్కడ చూడటం ఆనందంగా ఉందని పర్యాటకులు చెప్పారు. అనంతరం ఇటలీ పర్యాటకులు పంచకర్మ వైద్యం గూర్చి డాక్టర్ వాహినిని అడిగి తెలుసుకోవటంతో పాటు, వారంతా పంచకర్మ చికిత్స చేయించుకున్నారు.



కానుమోలులోని ఆయుర్వేద ఆస్పత్రిని సందర్శించిన ఇటలీ పర్యాటకులు

అధికార పార్టీ పెత్తనం తగదు

- బకాయి సొమ్ము ఇవ్వాలి
- కార్మికుల సంఖ్య ప్రకటించాలి
- తాడిగడప మున్సిపాలిటీ వద్ద కార్మికుల ధర్నా



పోరంకిలో మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతల పెత్తనం తగదని హెచ్చరించారు. పోరంకిలో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద సంఖ్యలో ఆందోళనను వ్యక్తం చేసి కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికులకు రావల్సిన బకాయి రూ.40 లక్షల సొమ్ము వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో ఇవ్వాల్సిన జీతాలు, హెల్త్ అలవెన్స్ ఇస్తామని ఎమ్మెల్యే, కమిషనర్ హామీ ఇచ్చినా నేటి వరకు అందలేదన్నారు. అసలు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు సెక్టార్లలో ఎంతమంది కార్మికులు పని చేస్తోంది జాబితాను కమిషనర్ బహిరంగంగా ప్రకటించాలన్నారు. ఈ మేరకు సమాచారం హక్కు చట్టం కింద వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో కొత్తగా వర్కర్లను తీసుకుంటున్నారని, వారిని ఏ ప్రాతిపదికన చేర్చుకుంటున్నారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులు అధికమయ్యాయి

మున్సిపాలిటీలో పని చేస్తున్న మేస్త్రీలు, కార్మికులపై అధికార పార్టీ నేతల పెత్తనం తగదని సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల పట్ల బెదిరింపులు ఎక్కువ అయ్యాయన్నారు. ఆప్కాస్‌లో మేస్త్రీగా నమోదైనవారిని కార్మికులుగా ఎలా మార్చుతారని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు ఉంటే టీడీపీ నేతల ఇళ్లకు వెళ్లి మాట్లాడుకోమని కార్మికులకు మేస్త్రీలు చెబుతుండటాన్ని ఖండించారు. కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించకపోతే కమిషనర్‌కు మాత్రమే చర్యలు తీసుకునే అధికారం ఉందని స్పష్టం చేశారు. ధర్నాలో నేతలు మస్తాన్ వలి, వై.సరళ, లక్ష్మీప్రసన్న, నరేంద్ర, రత్నకరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ప్రయత్నాలు వారివే!

- డీఆర్వో స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు బదిలీ అయ్యే అవకాశం
- మండలస్థాయి అధికారుల బదిలీలకు జీవో విడుదల
- నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో అధికారులు



చిలకపూడి(మచిలీపట్నం): బదిలీల సీజన్ కావడంతో వారు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి అధికారుల తీరు ఎవరి ప్రయత్నాలు వారివే అన్నట్లు ఉంది. జిల్లాలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కాకుండా డీఆర్వో స్థాయి నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులు బదిలీ అవుతారని సమాచారం తెలుస్తోంది. జిల్లాలో ఉన్న వివిధశాఖల అధికారులు దాదాపు రెండేళ్లకు పైబడి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. వీరిని కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీలు చేస్తారని వారికి అనుకూలమైన వారిని తెచ్చుకుంటారని ఊహాగానాలు వచ్చాయి. ముందుగానే సంబంధిత అధికారులు ఏఏ ప్రాంతాలకు ఏఏ పోస్టులకు వెళ్లాలో దాని ప్రకారం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ఏ అధికారి ఎక్కడి నుంచి వచ్చారు, ఎలా పని చేస్తున్నారు, ఎవరికి అనుకూలంగా ఉంటారని వాకబు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

జిల్లాలో వివిధ విభాగాల అధికారులు బదిలీ అయ్యే పరిస్థితులు ఉన్న దృష్ట్యా వారికి అనుకూలమైన అధికార పార్టీ నేతలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం తాను ఇక్కడ పనిచేస్తున్నా నాకు ఫలానా పోస్టింగ్ ఇస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలా అధికారులు నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఖాళీగా ఉండి ఇన్‌చార్జ్‌లుగా ఉన్న స్థానాలను కూడా భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులు ఆయా పోస్టులకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సచివాలయంలో ఉన్నతాధికారులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

జీవో విడుదల కావడంతో..

ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సొంత జిల్లాలకు చెందిన మండలస్థాయి అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికలు పూర్తైన తర్వాత సొంత జిల్లాలకు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. దీనిలో సంబంధిత అధికారి స్వస్థలం రెవెన్యూ డివిజన్ పరిధిలో లేకుండా ఇతర డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన తర్వాత కలెక్టర్‌కు రిపోర్టు చేసిన అనంతరం వారికి మండలాలు కేటాయించాల్సి ఉంది. ఈ ఉత్తర్వులను అనుసరించి మండలస్థాయి అధికారులు వారికి కావాల్సిన ఒకటి, రెండు మండలాలను ప్రధాన అంశాలుగా పెట్టుకుని ఆ దిశగా సంబంధిత ప్రజాప్రతినిధులతో ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏదేమైనా జిల్లా అధికారులతో పాటు మండలస్థాయి అధికారులు మంచి స్థానాల కోసం ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేశారు.

పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా



సదస్సు సందర్భంగా కళాక్షేత్రం ఎదుట ఏర్పాటు చేసిన లోగోను తిలకిస్తున్న కలెక్టర్ సృజన

సెర్ప్, డీఆర్డీఏ మేధోమథన సదస్సులో కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలను వినియోగించుకుని మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సెర్ప్, డీఆర్డీఏ ఆధ్వర్యాన బుధవారం మేధోమథన సదస్సు జరిగింది. మహిళా సారథ్య పరిశ్రమలపై ఎక్స్‌పో నిర్వహించారు. సదస్సును కలెక్టర్ సృజన, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ)కు సంబంధించి 100 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తమకు ఆసక్తి ఉన్న యూనిట్ ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 10 వేల యూనిట్ల ఏర్పాటు దిశగా అడుగులేస్తున్నామన్నారు. సెర్ప్ డీజీఎం (బ్యాంకు లింకేజీ) ఎం.కేశవకుమార్, స్త్రీనిధి ఎండీ నాంచారయ్య, పీఎంఎఫ్ఎంఈ జెడ్ఎం జనార్దన్, వ్యవసాయ అధికారి నాగమణెమ్మ, పశుసంవర్ధక అధికారి కె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో మరిన్ని వసతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని ఈవో కె.ఎస్.రామరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దుర్గాఘాట్‌ను బుధవారం ఈవో రామరావు ఇంజినీరింగ్, వైదిక కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఘాట్‌లో సదుపాయాలను పరిశీలించి స్నానఘాట్ల వద్ద పారిశుద్ధ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్‌లో నిత్యం కృష్ణమ్మ ఇచ్చే పంచహారతులపై ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ వసతులపై శ్రీనివాసశాస్త్రి ఆలయ ఈవోకు వివరించారు. ఘాట్‌లో భక్తులకు, పంచహారతులు ఇవ్వడానికి అవసరమైన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈవో వెంట ఈఈ లింగం రమాదేవి, ఏఈలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పొలంబడితో అధిక దిగుబడి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించి అధిక దిగుబడి సాధించడానికి పొలంబడి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యాన గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పొలంబడి కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తల మార్గదర్శకాలు, సూచనలు పాటిస్తూ విత్తనం నుంచి విక్రయం వరకు అవసరం మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులను వాడుతూ పంటలు పండించాలన్నదే పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులతో అన్ని రకాల పంటలపై 14 వారాల పాటు రైతులకు శిక్షణ ఇస్తారన్నారు. పండించిన పంటలో ఎంతశాతం పురుగు, ఎరువుల అవశేషాలు ఉన్నాయో నిర్ధారించి సర్టిఫై చేసిన తర్వాత ఏపీ సేంద్రియ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ వారు రైతులకు సర్టిఫికెట్ ఇస్తారన్నారు. దీని ఆధారంగా 135 దేశాల్లో సొంతంగా రైతు లేదా రైతు గ్రూపులు వారి ఉత్పత్తులను నేరుగా మంచి ధరకు అమ్ముకునే అవకాశం ఉందన్నారు. పొలంబడి కార్యక్రమాలను రొటీన్‌గా కాకుండా గ్రామంలోనే ఉంటూ సొంతంగా సాగు చేసే ఆసక్తిఉన్న రైతులను గుర్తించి క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి పద్మావతి, సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి, డీడీ మనోహర్, ఏడీ శ్రీనివాసరావు, మణిధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డెప్యూటీ సీఎంను కలిసిన ఎన్టీఆర్ జిల్లా సీపీ



విజయవాడస్పోర్ట్స్: డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్‌కు సీపీ రాజశేఖరబాబు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

బాలికపై లైంగిక దాడి.. యువకుడిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకొని ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు రేప్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరీపేటకు చెందిన బాలిక(14) పదో తరగతి చదువుతోంది. కాగా ఈ నెల 23వ తేదీ రాత్రి ట్యూషన్‌కని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 24వ తేదీన ఉదయం బాలిక ఇంటికి రాగా రాత్రంతా ఎక్కడకు వెళ్లావని ప్రశ్నించగా న్యూఆర్‌ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తూ మటన్ షాపులో పనిచేసే తుపాకుల సల్మాన్ అనే యువకుడు తనను ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడని, ట్యూషన్ నుంచి వస్తున్న తనను సల్మాన్ తన ఇంటికి తీసుకువెళ్లి నిన్ను పెళ్లి చేసుకునేది తానే అంటూ నమ్మించి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సల్మాన్‌పై పోలీసులు రేప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీడీఎస్‌కు బిడ్డ అప్పగింత

పామర్రు: వివాహం కాకుండానే ఓ మగ బిడ్డకు జన్మనిచ్చిన యువతి.. ఆ బిడ్డను పోషించే స్తోమత లేక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ వెల్లడించారు. కృష్ణాజిల్లా పామర్రు మండల పరిధి పెదమద్దాలి శివారు కొండాయపాలెం గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి పెళ్లి కాకుండా ఈనెల ఐదో తేదీన మగ బిడ్డకు జన్మనిచ్చింది. యువతి, ఆమె తల్లిదండ్రులు ఆ శిశువును వేరే ప్రాంతం వారికి అప్పగించి ఏమీ ఎరగనట్లు వచ్చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామంలో ఆధార్ నమోదు కార్యక్రమం భాగంగా ఐసీడీఎస్ అధికారులు బిడ్డకు జన్మనిచ్చిన తల్లి వివరాల సేకరణకు వచ్చారు. దీనితో బిడ్డ వేరే ప్రాంతంలో తల్లి మరో ప్రాంతంలో ఉన్నట్లు వారు గుర్తించి, తక్షణమే బిడ్డను తీసుకురావాలని ఆదేశించారు. వెంటనే వారు ఆ బిడ్డను అక్కడకు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో జన్మనిచ్చిన తల్లి తన బిడ్డను పోషించలేనని తాను ఆర్థికంగా స్థిర పడే వరకు శిశు సంక్షేమ సంరక్షణలో ఉంచాలని కోరగా.. దీంతో ఆ మగ శిశువును విజయవాడ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ సంఘ నాయకురాలు ఉమారాణిలకు బుధవారం రాత్రి బిడ్డను అప్పగించారు.

వాక్కాయతో అవాక్కయ్యే లాభాలు!

- అతి తక్కువ పెట్టుబడితో సాగుకు అవకాశం
- వర్షాధారంతో పండే పంట
- కోతులు, గేదెలు నష్ట పరుస్తాయన్న బెంగలేదు
- కొత్త తరహా సాగుతో ఆదర్శనంగా నిలుస్తున్న పెనుగంచిప్రోలు రైతు



పెనుగంచిప్రోలు సాగు అవుతున్న వాక్కాయ




వాక్కాయ మొక్క ఇదే

పెనుగంచిప్రోలు: సాగునీటి తడులు అక్కర్లేదు.. అంతా వర్షాధారమే. చీడపీడల బెడద బొత్తిగా లేదు. పంటను పశువులు, కోతులు తింటాయన్న భయం లేదు. దీని కొమ్మలకే ముల్లుంటాయి. కాబట్టి వేరే కంచె వేసే ఖర్చు లేదు. వాక్కాయ చెట్లు ఆకుల నుంచి పాలు వస్తాయి అందువల్ల గొర్రెలు కూడా వీటి జోలికి వెళ్లవు. మొక్కలు నాటిన మూడు లేదా నాలుగో ఏడాది నుంచి కాయలు కోసి అమ్ముకోవటమే. కోత కూలి ఖర్చు తప్ప మరే ఖర్చు లేదు. అలా సుదీర్ఘకాలం ఎంచక్కా పంట తీసుకుంటూనే ఉండవచ్చు. భలే బాగుంది కదండి.. ఖర్చు లేని సాగు. ఇంతకీ దీని పేరు ఏంటంటే క్యాండేట్ చెర్రీ. దీనినే వాక్కాయ అంటారు. జగ్గయ్యపేట ప్రాంతంలో పెనుగంచిప్రోలుకు చెందిన స్వామి గోపాలరావు ఈ పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

నష్టాల దిగులు అవసరం లేదు..

అందరూ సాగు చేసే పంటలను ఆరుగాలం కాయ కష్టం చేసి అయినకాడికి అప్పులు చేసి పంటలు పండించినా.. దిగుబడి లేకనో.. మార్కెట్‌లో ధర దక్కకనో రైతులు ఆర్థికంగా నష్టాల పాలవుతున్న రోజులు. అయితే కొండంత ధైర్యంతో కొత్త పంటలపై దృష్టి సారించి చక్కటి ఆదాయం పొందవచ్చని గోపాలరావు లాంటి రైతులు రుజువు చేస్తున్నారు. గోపాలరావుకు మామిడి తోట ఉంది. అయితే కోతులు పంటను నాశనం చేస్తున్నాయి. ఏ పండ్లు వేసినా అదే పరిస్థితి ఉంది. దీంతో అతను మామిడి చెట్లను తీసేసి నిమ్మతో పాటు ఎకరం పొలంలో వక్కాయ సాగు చేశాడు. అలాగే గ్రామం మధ్యలో ఉన్న తన 40 సెంట్ల స్థలంలో కూడా వాక్కాయ సాగు చేశాడు. కడియం నుంచి మొక్కలు తెచ్చి పొలంలో నాటాడు. పొలంలో ఒక్కో మొక్క రూ.60 వెచ్చించి ఏడాది వయసున్న మొక్కలు నాటాడు. గ్రామంలో నాటిన మొక్కలు మాత్రం కాయలు కాస్తున్నవి.. ఒక్కొక్కటి రూ.1000కి తెచ్చి నాటాడు. ఇప్పుడు వాటి నుంచి చెట్టుకు 5 నుంచి 6 కిలోల కాయలు వస్తున్నాయి. గ్రామస్తులు అక్కడికి వచ్చే కొనుగోలు చేస్తున్నారు. తోట దగ్గర హోల్‌సేల్‌గా అయితే కిలో రూ.150కి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో కిలో రూ.200 వరకు అమ్ముతున్నారు. రేటు ఎంత తగ్గినా ఏడాదికి ఎకరానికి రూ.లక్ష ఆదాయం నిరంతరం వస్తుంది. ఎకరానికి 200 మొక్కలు చొప్పున నాటుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా వర్షాకాలం కాపు ఎక్కువగా ఉంటుంది. చెట్లు పెద్దవి అయ్యేంతవరకు అంతర పంటల సాగు చేసుకోవచ్చు.



వాక్కాయలు

ఆదాయం.. ఆరోగ్యం..



వాక్కాయ అనేది దీర్ఘకాలిక పంట. వేసిన మొక్క చనిపోదు. దీనిని పొలాలకు కంచెగా వేసుకుంటే రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. రెండు అడుగులకు ఒక మొక్క వేసుకుంటే జీవిత కాలం ఉంటుంది. ముఖ్యంగా కోతులు, గేదెలు తింటాయన్న ఇబ్బంది ఏమీ లేదు. ప్రస్తుతం మా ప్రాంతంలో కోతులతో ఏ పండ్ల తోటలు బతకటం లేదు. ఈ పంటకు పెట్టుబడి తక్కువ. వాక్కాయలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంట్ కావటం వల్ల పోషకాలు ఉండటంతో పాటు అంటువ్యాధులతో పోరాడుతుంది. సీజన్‌లో దొరికే ఈ వాక్కాయ ఆహారంలో భాగం చేసుకోవటం వల్ల మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవటానికి ఉపయోగ పడుతుంది. వగరు, పులుపు కలిసిన ఈవాక్కాయలో అధికంగా ఫైబర్ ఉంటుంది. ముఖ్యంగా అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం తొలగించటానికి ఉపయోగపడుతుంది.

– స్వామి గోపాలరావు, తోట యజమాని

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

పలువురికి అదనపు బాధ్యతలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్ స్థాయి అధికారులతో పాటు పలువురు ఉద్యోగులకు, సిబ్బందికి అంతర్గత బదిలీలు జరిగాయి. కొంత మందికి అంతర్గత బదిలీలు, మరి కొంత మందికి ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఈవో కేఎస్ రామరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్ టీవీ రవిప్రసాద్ ప్రస్తుతం దేవదాయ శాఖ కమిషనర్ సీసీగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఆయనను అక్కడే కొనసాగించారు. అకౌంట్స్, ఐటీ రిటర్న్స్, జీఎస్టీ రిటర్న్స్ బాధ్యతలు చూసే కేవీ దుర్గాప్రసాద్‌కు అదనంగా కొండ దిగువన ప్రసాదాల కౌంటర్ల పర్యవేక్షణ, స్టేషనరీ, ఎంవీ ఫామ్స్ బాధ్యతలు అప్పగించారు. కె. శ్రీనివాసరావుకు శానిటేషన్, దత్తత దేవాలయాలు, సబ్ టెంపుల్ విభాగం నుంచి ప్రసాదాల తయారీ, కొండ దిగువన ప్రసాదాల కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఎ. అమృతరావును లాండ్స్, లీజెస్ విభాగం విధులకు అదనంగా శివాలయం, సబ్ టెంపుల్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ప్రోటోకాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న తాడి గురురాజుకు కొండపై కౌంటర్లు, డోనర్ సెల్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. బీఎస్ జగదీష్‌కు ప్రధాన ఆలయం బాధ్యతతో పాటుగా పరిపాలనా విభాగం, వేదపాఠశాల, ఐటీ విభాగాల బాధ్యతలను అదనంగా అప్పగించారు. వి. నగేష్‌కు దత్తత దేవాలయాలతో పాటు కేశఖండనశాల, దుర్గాఘాట్, కృష్ణమ్మ హారతులు, టోల్‌గేట్ బాధ్యతలు అప్పగించారు. కేశఖండనశాల, టోల్‌గేట్, దుర్గఘాట్ నిర్వహణ బాధ్యతలు నిర్వహించిన డీవీవీ సత్యనారాయణకు పీఆర్వోగా బాధ్యతలు అప్పగించారు. స్టేషనరీ, ఎంవీ. ఫామ్స్, పూజలు విభాగం పర్యవేక్షించే పి. సునీతకు పూజలు, ఫెస్టివల్, ధర్మపథం, కల్చరల్ ప్రోగ్రాం బాధ్యతలు అప్పగించారు. మెయిన్ స్టోర్స్ బాధ్యతలు నిర్వహిస్తున్న పి. భాగ్యజ్యోతి, కనకదుర్గప్రభ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న కె. హరికృష్ణల విధులలో ఎటువంటి మార్పులు చేయలేదు. ఇక అటెండర్, రికార్డు అసిస్టెంట్, ఎన్ఎంఆర్, స్వీపర్, అవుట్ సోర్సింగ్, జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో 70 మందికి పైగా ఒకే దఫా అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో ఆదేశాలిచ్చారు.

పగలు వంట పని.. రాత్రిళ్లు చోరీలు

- కొత్తపేటలో ఘరానా దొంగ అరెస్ట్
- రూ. 10.78 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు చూపుతున్న ఏసీపీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పగలు వంట పని చేస్తూ.. రాత్రిళ్లు తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి బంగారం, వెండి వస్తువులను కాజేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడి వివరాలను వెస్ట్ ఏసీపీ పి. మురళీకృష్ణారెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి వివిధ కేసులకు సంబంధించి రూ. 10.78 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులతో పాటు రూ. 1.27 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఎలా దొరికాడంటే..

ఈ నెల 21వ తేదీన అంబాపురానికి చెందిన అల్లంపల్లి మణికంఠ సమీపంలోని తన తమ్ముడైన అనిల్‌కుమార్ ఇంటికి కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. ఈ సమయంలో మణికంఠ ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి బీరువాలో 66 గ్రాముల బంగారు ఆభరణాలు, 53 గ్రాముల వెండి వస్తువులతో పాటు రూ. 1.27 లక్షల నగదు చోరీ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కొత్తపేట సీఐ గణేష్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలు కేసు దర్యాప్తును వేగవంతం చేశాయి. అందులో భాగంగా ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించే క్రమంలో పాత కేసులలో నిందితుడిగా ఉన్న వ్యక్తిని గుర్తించారు. అనుమానితుడిపై నిఘా పెట్టగా అతను వాంబేకాలనీకి చెందిన ములకల నిరంజన్‌గా గుర్తించారు. నిందితుడిని మంగళవారం ఉదయం ఎర్ర కట్ట సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 10.78 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులతో పాటు రూ. 1.27 లక్షల నగదు, సెల్‌ఫోన్, ఎల్ఆర్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కొత్తపేట పోలీస్‌స్టేషన్‌తో పాటు అజిత్ సింగ్‌నగర్, ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. గత పదేళ్లలో నిందితుడు విజయవాడ, ఏలూరు పరిసర ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ పరిధిలో 60కి పైగా దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో కొత్తపేట సీఐ టి. గణేష్, ఎస్ఐ రాజనరేంద్ర, కానిస్టేబుల్స్ చక్రవర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి వంట పని!

వాంబేకాలనీకి చెందిన ములకల నిరంజన్(32) అలియాస్ చందు చిన్నతనం నుంచే పేకాట ఇతర వ్యసనాలకు అలవాటు పడ్డాడు. తెలిసిన వారితో ఫంక్షన్లలో వంట పని చేస్తూ, వచ్చిన డబ్బులతో జల్సాలు చేసే వాడు. పనులు లేని సమయంలో చిన్న చిన్న దొంగతనాలు చేయడం అలవాటుగా మారింది. దీంతో పగటి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, ఆ పరిసరాల్లో ఒకటికి రెండు సార్లు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడే వాడు. బంగారం, వెండి వస్తువులతో పాటు విలువైన వస్తువులను చోరీ చేసి వాటిని విక్రయించి డబ్బుతో జల్సాలు చేస్తుంటాడు. నిరంజన్‌కు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. చివరకు అంబాపురంలో చోరీకి పాల్పడే ముందు నిందితుడు చేసిన రెక్కీనే అతన్ని పోలీసులకు పట్టించిందని తెలుస్తోంది.

పనులను త్వరితగతిన పూర్తి చేయండి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ఖనిజ, ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఖనిజ ఫౌండేషన్స్ ట్రస్ట్ నిధుల వినియోగంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డీఎంఎఫ్‌టీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయటంతో పాటు ఇంకా మొదలుకాని పనులకు టెండరు ప్రక్రియ మొదలుపెట్టి పనులను ప్రారంభించాలన్నారు. ఇప్పటి వరకు ఏయే పనులు పూర్తయ్యాయి. టెండర్లు పిలిచి పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు, టెండర్లు పిలవాల్సిన పనులు, బిల్లుల చెల్లింపు తదితర వివరాలను ప్రొఫార్మాలో శాఖల వారీగా రిపోర్టును సమర్పించాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే తయారు చేసి ఆలస్యం చేయకుండా సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, ఇరిగేషన్ ఈఈ విజయలక్ష్మి, భూగర్భ గనులశాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధురాలిపై దాడి, బంగారం అపహరణ



సంఘటన వివరాలను తెలుసుకుంటున్న ఎస్ఐ విశ్వనాథ్

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం యాకమూరు గ్రామంలో పట్ట పగలు దోపిడీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాకమూరు గ్రామానికి చెందిన చొప్పవరపు ఆంజనేయులమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఈ విషయాన్ని గ్రహించిన స్థానికంగా ఉన్న నాగమణి అనే మహిళ బుధవారం ఎవ్వరూ లేని సమయంలో ఆంజనేయులమ్మను బెదిరించి, గొంతునొక్కి బలవంతంగా ఆమె చేతులకు ఉన్న ఐదు కాసుల బంగారు గాజులను దోచుకెళ్లిపోయింది. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేయగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. దోపిడికి పాల్పడిన నాగమణిని అదుపులోకి తీసుకున్నట్లు తోట్లవల్లూరు మండలం ఎస్ఐ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌కే సింగ్ తదితరులు

పటమట(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేయాలని జాతీయ రహదారుల రీజనల్ అధికారి ఆర్‌కే సింగ్ అన్నారు. బుధవారం పటమటలోని సంస్థ రీజనల్ కార్యాలయంలో ఆయన రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోట్లు వెచ్చించి జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందని, రోడ్డు ప్రమాదాలలో వాహన దారులు మరణిస్తున్నారని, ప్రమాదాల నివారణ కోసమే ప్రజల్లో అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన రోడ్డు భద్రతా పోస్టర్లు ఆవిష్కరించారు. రోడ్ సేఫ్టీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కే దుర్గ పద్మజ, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు

విద్యారంగంపై కేంద్రం చిన్నచూపు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి



విజయవాడ దాసరి భవన్ వద్ద నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి అన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపుల్లో కోత విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సీపీఐ కార్యాలయం ఎదుట కళ్లు, చెవులు, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటేటా విద్యారంగానికి కేటాయింపుల పెరగాల్సింది పోయి తగ్గిపోతున్నాయన్నారు. గతేడాది బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1.25 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. విద్యారంగాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం.. పేద వర్గాలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. నిధుల్లో కోత విధించి ఏ విధంగా ఆ రంగాన్ని అభివృద్ధి చేస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జాతీయ విద్యాసంస్థలకు నిధుల కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.వలరాజు, రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ఉంగుటూరు: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆత్కూరులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్కూరు వైఎస్సార్ కాలనీకి చెందిన చిన్న వెంకటేశ్వరరావు ఏలూరు జిల్లా పెద్దపాడు మండలం వసంతవాడకు చెందిన కత్తి ప్రియాంక (30)తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. వెంకటేశ్వరావు మద్యానికి బానిసై ప్రియంకతో తరచూ ఘర్షణ పడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఘర్షణపడి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూస్తే ప్రియాంక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతోంది. ఈ విషయాన్ని మృతురాలి తల్లిదండ్రులకు తెలియజేశాడు. అక్కడకు చేరుకున్న మృతురాలి తండ్రి ఆత్కూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పైడిబాబు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునారు.

అసోచామ్ ఏపీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కో చైర్మన్‌గా బన్సీధర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్) ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కో చైర్మన్‌గా స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ బన్సీధర్ బండి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అసోచామ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంయుక్త సమావేశంలో ఈ నియామకం జరిగింది. బండి బన్సీధర్ నియామకంపై కౌన్సిల్ ఏపీ చైర్మన్ కటారు రవికుమార్‌రెడ్డి, తెలంగాణ కో చైర్మన్ పిన్నపురెడ్డి శ్రీధర్ అభినందనలు తెలిపారు. ఉక్కు, ఇంధనం, సహజ వనరులు, సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేసిన విస్తృత అనుభవం బండికి ఉందని పేర్కొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు ఎదుట మృతదేహంతో ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో స్పిన్నింగ్ మిల్లు ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లిలో గత నెల 19వ తేదీన మోహన్ స్పిన్‌టెక్స్ కార్మికులను తరలించే బస్సు గ్రామానికి చెందిన నల్లగంచు సుదర్శన్ (45)ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుదర్శన్ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సుదర్శన్ మృతికి కారణమైన వాహనదారులు నష్టపరిహారం అందించి, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మల్లవల్లిలోని మోహన్ స్పిన్‌టెక్స్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ గేటు ఎదుట సుదర్శన్ మృతదేహాన్ని పెట్టుకుని ఆందోళన చేయటంతో ఎట్టకేలకు యాజమాన్యం దిగి వచ్చింది. మృతుని కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

బాలికపై లైంగికదాడి.. దోషికి 20ఏళ్ల జైలు

చిలకలపూడి (మచిలీపట్నం): ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడి చేసిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ మచిలీపట్నంలోని పోక్సో కోర్టు న్యాయాధికారి గాజుల వెంకటేశ్వర్లు బుధవారం తీర్పు చెప్పారు. కృష్ణాజిల్లా పెడన పట్టణం వీరభద్రపురానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన భట్టా జ్ఞానవిఘ్నేశ్వరరావు లైంగిక దాడి చేశాడు. ఈ ఘటనపై 2015 జూన్ రెండో తేదీన పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముంజులూరు వెంకటమహేష్‌కుమార్ 12 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరారోపణ రుజువవడంతో న్యాయాధికారి పై విధంగా తీర్పు చెప్పారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలికి చెల్లించాలని, నష్ట పరిహారంగా ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెదకాకాని:అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు పెదకాకాని పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం విస్సన్నపేట మండలం, తాగుకుంట్లకు చెందిన కడియాల వెంకట కృష్ణారావు (58) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెదకాకాని పీహెచ్‌సీ సమీపంలోని క్వారీలో మృతి చెంది ఉన్నాడు. ఆధార్ కార్డు ప్రకారం మృత దేహాన్ని గుర్తించి బంధువులకు సమాచారం అందిం,అనే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.